# దాం దుంపదెగ ...!

"ఇదిగో .. వేడిచాయ !' తల స్నానమయాక తడారుతున్న జుట్టును సవరించుకుంటూ భర్త ముందున్న టీపాయ్ మీద చాయ గ్లాసుంచి, పూజాగది కెళ్లింది అశ్వని. ముద్దబంతి మొహమ్మీద మురిపాల ఛాయలు అలాగే ఉన్నాయి. 'కోటేశ్వర గ్రూపాఫ్ కంపెనీ'ల యజమాని కోటేశ్వరరావు ... మామూలుగా అయితే పెళ్లాన్ని ఒడిలోకి లాక్కునే వాడే కానీ... అప్పటికే బుర్ర స్టీమ్ ఇంజనులా వేడెక్కి ఉంది. 'హైకోర్టు లాయర్ ఆనందరావు సలహా బలే బాగుంటుంది..' గొణుక్కున్నాడు.

ఆనందరావు కోటేశ్వరరావులు క్లాసు మేట్సు, గ్లాసుమేట్సు. అనుబంధము బీరు-బిర్యానిలా పెనవేసుకు పోయింది. ఖుషిగా ఫోనందుకుని నెంబరు తిప్పాడు.

'హలో ఆనందం ! నాదో సమస్య .... జాగ్రత్తగా విను ...'

'హలో ... అసలూ ... ' అక్కడి గొంతు,

"దాందుంపదెగా, ఆగూ ఆగురా... నా బాధ వినురా మొగుడా !" సోఫాకొరిగి గొంతు సవరించుకున్నాడు. ఓ ముద్దుగుమ్మ దాం దుంపదెగ, ముడితే మాసిపోయేట్టుంది. మూడేళ్ల క్రితం నా చాంబర్ కొచ్చి ఉద్యోగం కావాలంది, ఆ చూపులు నన్ను గిలిగింతలు పెట్టాయనుకో. నడి వయసు నడుమంత్రపుది గదా ... ఉద్యోగమిచ్చేసింది పియ్యేగా వేసుకున్నా. దాం దుంపదెగా... నేను సయ్యంటే అది సై సై అందిరా, నేను చేయి పట్టుకోబోతే తాను ముద్దు బెట్టుకుంది. ఇంకేముంది, నా కోర్కెల గుర్రం దానికి దాసోహమంది.

దానికన్నీ ఇచ్చిన. ఓ బిల్డింగు గూడా కొనిచ్చిన. నిన్న రాత్రి మాట వరుసకు, 'నీవడిగిన వన్నీ ఇచ్చిన. నువు నా కేమిస్తావు' అని అడిగిన వెంటనే 'నువు పట్టు దప్పినవు. నేను నెలదప్పిన. ఓ బాబు నిస్తాలే' అంది. నా గుండే గుబేల్ మందిరా. నా ఇంటి కొచ్చి ఆస్తిలో వాటా కావాలని అడిగితే ఎట్లరా ? నా భార్య పతివ్రత గదా. దాని తమ్ములకీ విషయం తెలిస్తే నా డొక్క చీల్చి డోలు కడతార్రా..." గుక్క తిప్పుకోకుండా చేప్పేశాడు. ఎందుకైనా మంచిదని తిరిగి అందుకుని

"అర్థమైందా ?" అడిగాడు.

'అంతా అర్థమైంది' నింపాదిగా జవాబొచ్చింది.

'మరిప్పుడేం చెయ్యాలి ?' ఆందోళన.

'వెంటనే నువ్విక్కడికి రావాలి'

'దాందుంపదెగ.. ఇక్కడికంటే ఎక్కడికి ?'

'ఆస్పత్రికి'

'ఏ ఆస్పత్రికీ'

'పిచ్చాసుపత్రికి'

'ఎందుకూ ?'

'మరిది ... పిచ్చాసుపత్రే గదా... నేను డాక్టర్‌ను'

షాక్ కొట్టింది. దీం దుంపదెగ... ఇదేమిటి? చేత్తో పాటు రిసీవర్ గూడా వణుకుతోంది.

'చెప్పవయ్యా తొందరగా నువొస్తావా లేదా ఇంటి అడ్రసు చెప్తావా ?' డాక్టర్ గొంతులో అసహనం.

'ఇంటి అడ్రసెందుకు ?'

'అంబులెన్స్ పంపిస్తా. మా మనుషులే నిన్ను ...'

అప్పుడే పూజ ముగించుకుని బయటికొచ్చింది అశ్విని. ఠక్‌న రిసీవర్ పెట్టేసి 'ఛీ ఛీ..' నెత్తికొట్టుకున్నాడు. అశ్వనికి గతుక్కుమంది.

'ఏమైందయ్యా ?' పరుగెత్తుకొచ్చి పక్కన కూచుంది గుడ్లు మిటకరిస్తున్న భర్తను చూస్తుంటే భయమేసింది. కొన కొంగుతో నుదుటి చెమట అద్దుతూ... "ఆసత్రి కెల్దామా?" అడిగింది గాబరాగా ...

'దాం దుంపదెగా... నువు గూడ ఆసుపత్రి అంటున్నావా ?' కోపమొస్తుంది. నాకు పిచ్చెక్కిందా ... ? అనుమానమొస్తుంది.

'దాందుంప తర్వాత తెగుద్ది గానీ ఇందాక ఏమైందీ' లాలనగా అడిగింది. జరిగినదంతా చెప్పేశాడు.

లోపల్నుంచి తోసుకొస్తున్న నవ్వును గొంతులో అదిమిపెట్టి 'అక్కడి వాళ్ళు ఫోనెత్తగానే ముందు నీ పేరు చెప్పి ఆ తర్వాత వాళ్ల పేరు అడిగావా ?'

'లేదు... అడుగ లేదు...' నాలిక్కరుచు కున్నాడు తన నెత్తిమీద తానే ఓ మొట్టికాయిచ్చుకున్నాడు.

'దాం దుంప దెగ ...' ఇంకేదో అనబోయాడు.

'దాం దుంప దాని దగ్గరే ఉండనీ' .... మళ్లీ నవ్వింది.

కోటేశ్వర రావు శృతి కలిపాడు ...

*(ఆకాశిక్, 16-31 అక్టోబర్, 2005)*